క్లుప్తంగా

హ్యాండ్ వాష్ సెట్ ప్రారంభం



చిట్యాల: మండల కేంద్రంలోని వెంకట్రావ్‌పల్లి(సీ)లో గల రెండవ అంగన్‌వాడీ కేంద్రలో కేర్ ఇండియా స్వచ్ఛంద సంస్థ యూనిసెఫ్ సహకారంతో హ్యాండ్ వాష్ సెట్‌ను ఏర్పాటు చేశారు. ఈ హ్యాండ్ వాష్ సెట్‌ను కేర్ సంస్థ ప్రతినిధి సదానందం సోమవారం ప్రారంభించి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలు ఆరోగ్యంగా ఉండాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. వ్యక్తిగత పరిశుభ్రత పెంపొందించేందుకు పిల్లలకు వచ్చే అంటువ్యాధులు, సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో హ్యాండ్‌వాష్ సెట్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ పుల్ల భాగ్యలక్ష్మి, ఆయా లద్దునూరి కొమురమ్మ, పుల్ల మల్లయ్య, పిల్లలు పాల్గొన్నారు.

రేపు ప్లాట్ల పంపిణీ

మల్హర్: ఓపెన్ కాస్ట్ ఏర్పాటులో భాగంగా మండలంలో తాడిచర్ల ఎస్సీ కాలనీలో ఇళ్లు కోల్పోయిన నిర్వాసిత లబ్ధిదారులకు ఆర్‌అండ్‌ఆర్ ప్లాట్లను రేపు(బుధవారం) పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 61 మంది లబ్ధిదారులకు ఆర్‌అండ్‌ఆర్ కాలనీ సైట్‌లో డ్రా సిస్టం ద్వారా భూపాలపల్లి ఆర్డీఓ శ్రీనివాస్ ప్లాట్లు అందించనున్నట్లు తెలిపారు.

ఆలయంలో శిఖండి పాము



గణపురం: మండలంలోని లక్ష్మారెడ్డిపల్లె గ్రామంలో శ్రీ రామలింగేశ్వర అభయాంజనేయ స్వామి ఆలయంలోని ప్రధాన గేటు వద్ద ఆదివారం రాత్రి రెండు తలల శిఖండి పాము కనిపించింది. దీంతో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వీక్షించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు, సర్పంచ్ ఒద్దుల విజయఅశోక్ రెడ్డి ఆధ్వర్యంలో పామును పట్టుకొని మోరంచవాగు సమీపంలో వదిలేశారు.

ద్విచక్రవాహనం చోరీ

మహదేవపూర్: ద్విచక్రవాహనం చోరీకి గురైన సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ షాహిన్ ఇంటి వద్ద ద్విచక్రవాహనాన్ని ఆదివారం రాత్రి ఉంచాడు. సోమవారం తెల్లవారుజామును లేచి చూసే వరకు ద్విచక్రవాహనం కనిపించలేదు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు. మండలంలోని దొంగతనాలు ఎక్కువ అయ్యాయని, పోలీస్‌లు రాత్రిపూట పెట్రోలింగ్ చేపట్టాలని కోరారు.

గుడుంబా స్వాధీనం

మొగుళ్లపల్లి: మండలంలోని ఆకినపల్లి గ్రామంలో గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శ్రీధర్ సోమవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో ఇల్లంతకుంట మండలంలోని సిరిసేడు గ్రామానికి చెందిన దుగ్యాల రమేశ్ అనే వ్యక్తి వద్ద 20 లీటర్ల గుడుంబా లభించినట్లు పేర్కొన్నారు. గుడుంబాను సిరిసేడు నుంచి ఆకినపల్లికి తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

ఒకరి ఆత్మహత్యాయత్నం

మొగుళ్లపల్లి: భూ తగాదాలో వ్యక్తి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సంఘటన మండలంలోని ముల్కలపల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చదువు వెంకట్‌రెడ్డి భూ తగాదాలతో మధ్యాహ్నం ఇంటి వద్ద పురుగుల తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చిట్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా, ఈ సంఘటనకు గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

యువకుడికి తీవ్రగాయాలు



గణపురం: రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలైన సంఘటన మండల కేంద్రం సమీపంలోని కొత్తపల్లి వద్ద సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా వెంకటాపురం మండలం లక్ష్మీదేవిపేట గ్రామానికి చెందిన మడిపెల్లి వంశీ(22) అనే యువకుడు గణపురం వైపు నుంచి అతడి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ములుగు నుంచి గణపురం వైపు వస్తున్న ఏపీ 31బీఏ1096 నంబర్ గల కారు ఎదురుగా వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వంశీకి కాలు విరుగడంతో పాటు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అతడిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. యువకుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

కంటి పరీక్షలు చేయించుకోవాలి



మహదేవపూర్: కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ అరుణ



మహాముత్తారం: ప్రేమ్‌నగర్‌లో..

మహదేవపూర్: కంటి వెలుగు శిబిరంలో ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని జెడ్పీటీసీ గుండాల అరుణ అన్నారు. సూరారం గ్రామంలో అంబట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని జెడ్పీటీసీ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మారెడ్డి, డాక్టర్ జగదీష్, ఏఎన్‌ఎంలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

మహాముత్తారం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండవ విడత కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీటీసీ వసంత, సర్పంచ్ రమ్యబాయి అన్నారు. సోమవారం మండలంలోని ప్రేమ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. కంటి వెలుగు శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామంలోని 80 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి పలువురికి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి మమత, ఏఎన్‌ఎంలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు నిర్మిస్తాం..



చిట్యాల: మాట్లాడుతున్న సత్యనారాయణరావు

చిట్యాల: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అర్హులందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని గాంధీనగర్, కుమ్మరిపల్లి, వరికోల్‌పల్లి, నైన్‌పాక, గోపాలపూర్ గ్రామాలలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలను పట్టించుకోని బీఆర్‌ఎస్ పార్టీని ప్రజలు తుంగలో తొక్కాలన్నారు. అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు అవుతున్న ఏ పేద కుటుంబానికి డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించి ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గూట్ల తిరుపతి, ముకిరాల మధువంశీకృష్ణ, చిలుకల రాయకొమురు, గుమ్మడి శ్రీదేవి సత్యనారాయణ, దొడ్డి కిష్టయ్య, మూల శంకర్‌గౌడ్, శ్రీనివాస్ నాయక్, బొట్ల రవి, గడ్డం కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

యాత్రను విజయవంతం చేయాలి

మొగుళ్లపల్లి: నియోజకవర్గంలో ఈ నెల 21, 22 తేదీల్లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టే హాథ్ సే హాథ్ జోడో యాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని మండల పార్టీ అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు బండి సుదర్శన్, పోల్నేని లింగారావు, రఫీ, రాజు, నీరటి మహేందర్, క్యాతరాజు రమేశ్, ప్రసాద్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి పాటుపడాలి



భూపాలపల్లి రూరల్: మాట్లాడుతున్న కీర్తిరెడ్డి

భూపాలపల్లి రూరల్: బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు పాటుపడాలని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు విష్ణు ఆధ్వర్యంలో భూపాలపల్లి మండలంలోని గొల్ల బుద్దారం గ్రామంలో సోమవారం ప్రజా గోస-బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కీర్తిరెడ్డి హాజరై మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. పార్టీని గ్రామాల్లో బూత్ స్థాయి నుంచి పటిష్టం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరుకల గణపతి, నాయకులు సత్తిరెడ్డి, శివరాత్రి వేణు, దేవేందర్, కొమురయ్య, దారవత్ తిరుపతి, అంబాల శంకర్, లాకవత్ సారయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపాలి

చిట్యాల: ప్రజలపై భారం మోపుతూ, రైతులను, నిరుద్యోగులను మోసం చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ప్రజా గోస – బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా కార్నర్ సమావేశాన్ని మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కీర్తిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి 24 గంటల కరెంట్ ఎక్కడ ఇస్తుందని ఆమె ప్రశ్నించారు. మండల కేంద్రంలో ఉన్న నూతన బస్టాప్‌ను ఎందుకు ప్రారంభించడం లేదని అన్నారు. ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సొంత పనులు చేసుకుంటున్నాడే తప్ప ప్రజల సమస్యలను పట్టించుకున్న దాఖాలాలు లేవని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేందర్, రఘు, రవీందర్, శ్రీకాంత్, మణికుమార్, మహేష్, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకలి తీర్చే అవకాశం రావడం అదృష్టం



కాటారం: మాట్లాడుతున్న పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు

కాటారం: ప్రజల ఆకలి తీర్చే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు బీఆర్‌ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్, పెద్దపల్లి జెడ్పీచైర్మన్ పుట్ట మధు అన్నారు. మండలంలోని కాటారం ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఐటీ కళాశాల విద్యార్థులకు పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మధ్యాహ్న భోజన వసతి కార్యక్రమాన్ని సోమవారం పుట్ట మధు ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుత మంథని ఎమ్మెల్యే ఏ ఒక్కరికి సాయం చేసిన దాఖలాలు లేవన్నారు. అనేక పదువులు పొంది ఆస్తులు సంపాందించుకోని ఆమెరికాలో కూడ బెట్టుకుంటున్నారని ఆరోపించారు. ఆకలి విలువ తెలిసినోళ్లే అన్నం పెడతారని, ఎక్కడ ఆకలి ఉంటుందో అక్కడ పుట్ట లింగమ్మ ట్రస్ట్ సేవలు ఉంటాయన్నారు. ఓట్లు వస్తున్నాయంటే ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు నోట్ల కట్టలతో దిగుతారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట జనార్దన్, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్‌రావు, సడవలి, యూత్ అధ్యక్షుడు రామిల్ల కిరణ్, సబ్ డివిజన్ యూత్ అధ్యక్షుడు నాయిని శ్రీనివాస్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు భూపెల్లి రాజు, మహిళ ప్రధాన కార్యదర్శి రత్న సౌజన్యరెడ్డి, సీనియర్ నాయకులు శ్రీలక్ష్మిచౌదరి, స్వప్న, సింగిల్ విండో వైస్ చైర్మన్ దబ్బెట స్వామి, పంతకాని సడవలి, దబ్బపేట రాజేష్, డోలి ఆర్జయ్య, లక్ష్మారెడ్డి, వెంకటస్వామి, శ్రావణ్, రవి, రాజేష్, శ్యామ్, రజనికుమార్, రాజకర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా పుట్ట లింగమ్మ ట్రస్టు



మహదేవపూర్: మధ్యాహ్న భోజనం ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

మహదేవపూర్: ప్రభుత్వ కళాశాలల్లో చదివే పేద విద్యార్థులకు పుట్ట లింగమ్మ ట్రస్టు అండగా ఉంటుందని సర్పంచ్ శ్రీపతిబాపు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పుట్ట లింగమ్మ ట్రస్టు ఎందరో నిరుపేదలకు సాయం చేస్తుందన్నారు. అలాగే ఈనెల 20వ తేదీన పుట్టలింగమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో మంథనిలో నిర్వహించనున్న మేగాజాబ్‌కు నిరుద్యోగులు హాజరై ఉపాధి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సల్మాన్ ఖాన్, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు లింగాల రామయ్య, మండల యూత్ అధ్యక్షులు అలీం ఖాన్, టౌన్ ప్రెసిడెంట్ రాకేశ్, టౌన్ యూత్ అధ్యక్షుడు రాజశేఖర్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ రవీందర్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు బాపురావు, సీనియర్ మండల నాయకులు లక్ష్మణ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇవ్వండి



మాట్లాడుతున్న చంద్రుపట్ల రామిరెడ్డి

పలిమెల: తన కుమారుడు సునీల్‌రెడ్డికి ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇవ్వండని మంథని మాజీ ఎమ్మెల్యే చంద్రుపట్ల రామిరెడ్డి ప్రజలను కోరారు. మండలంలోని లెంకలగడ్డ, పంకెన, మోదేడు, పలిమెల, సర్వాయిపేట గ్రామాల్లో బీజేపీ రాష్ట్ర నాయకుడు, మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్ సునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ.. తనకు గతంలో అవకాశం ఇచ్చినట్టే తన కుమారుడికి ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని కోరారు. అవకాశవాదులు, దోపిడీదారులకు కాకుండా న్యాయం కోసం, ప్రజల శ్రేయస్సు కోసం పాటుపడే సునీల్‌రెడ్డికి అవకాశం ఇవ్వాలన్నారు. అనంతరం సునీల్‌రెడ్డి మాట్లాడుతూ.. తనకు ఒక్క అవకాశం ఇస్తే మంథనిని నియోజవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. మండలంలోని లెంకలగడ్డ, కామన్‌పల్లి గ్రామాలకు చెందిన పలువురు నాయకులు బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నిరంజన్, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు పాపయ్య, నాయకులు జనగామ ప్రభాకర్, ఉపేందర్, బాలు, రవీందర్, తిరుపతి, సూరం మహేష్, రంజిత్, జోగేష్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



రామస్వామిని పరామర్శిస్తున్న మధు

మల్హర్: మండలంలోని పెద్దతూండ్ల గ్రామానికి చెందిన చిలకమ్మ, శేఖర్, తాడిచర్ల గ్రామానికి చెందిన రమేశ్ ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను బీఆర్‌ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్, పెద్దపల్లి జెడ్పీచైర్మన్ పుట్ట మధు సోమవారం పరామర్శించారు. అలాగే తాడిచర్ల గ్రామానికి చెందిన రామస్వామి అనారోగ్యంతో బాధపడుతుండగా పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట రైతుబంధు మండల అధ్యక్షుడు గోనె శ్రీనివాసరావు, ఎంపీటీసీ రావుల కల్పన మొగిళి, మండల నాయకులు తాజోద్దీన్, వాల యాదగిరిరావు, మండల కోఆప్షన్ సభ్యుడు అయ్యూబ్‌ఖాన్, మండల అధికార ప్రతినిధి బండి రాజయ్య, మంథని మార్కెట్ కమిటీ డైరెక్టర్ సమ్మయ్య, సర్పంచ్ సత్యనారాయణ, యూత్ మండల ప్రధాన కార్యదర్శి నవీన్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బూడిది సదానందం, గ్రామ కమిటీ అధ్యక్షుడు రమేష్, మధుసూదన్‌రావు, నాయకులు నాగేశ్వర్‌రావు, సమ్మయ్య, సతీష్, సమ్మయ్య, సురేష్‌రెడ్డి, బాపు, సతీష్, రాజు, సమ్మయ్య, ప్రసాద్, మల్లేష్, రజినీకాంత్ పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు పటిష్ట భద్రత



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న సీఐ, ఎస్సై

గణపురం: కాకతీయుల కళాక్షేత్రం కోటగుళ్లలో ఈ నెల 18న నిర్వహించనున్న శివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పటిష్టమైన భద్రత చర్యలు చేపడుతామని చిట్యాల సీఐ పులి వెంకట్‌గౌడ్, గణపురం ఎస్సై మ్యాక అభినవ్ అన్నారు. కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శివరాత్రి సందర్భంగా నిర్వహించే శివపార్వతుల కల్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రాలను సోమవారం గణపురం పోలీస్‌స్టేషన్‌లో వారు ఆవిష్కరించి మాట్లాడారు. కోటగుళ్లలో శివరాత్రి సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని అన్నారు. ఆలయానికి వచ్చే భక్తుల పార్కింగ్ కోసం ఆలయ సమీపంలో ఇరు వైపుల స్థలాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు నరేష్, ఆలయ పరిరక్షణ కమిటీ గౌరవ అధ్యక్షుడు మామిండ్ల మల్లికార్జున్‌గౌడ్ ఉన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్సై శ్రీధర్

మొగుళ్లపల్లి: సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడంతో గ్రామాల్లో నేరాలను నియంత్రించవచ్చునని ఎస్సై శ్రీధర్ అన్నారు. సోమవారం మండలంలోని బంగ్లాపల్లిలో గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యాక్రమానికి ఎస్సై ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా నేరాల సంఖ్య తగ్గుతుందన్నారు. గ్రామాల్లో దొంగతనాలు, దోపిడీలు పోకిరీల ఆటలు సాగవన్నారు. నేరం చేసిన వారిని సులభంగా గుర్తించేందుకు దోహదపడుతాయన్నారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రజితయువరాజు, పంచాయతీ కార్యదర్శి అనూష, గ్రామ పంచాయతీ పాలకవర్గం, గ్రామస్తులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



ఆలయ ఆవరణలో హోమం చేస్తున్న భక్తులు

మల్హర్: మండలంలోని ఎడ్లపల్లి గ్రామంలోని షిరిడి సాయిబాబా ఆలయ 11వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదానం చేశారు. హారతి, పాలాభిషేకం, హోమం, పంచామృత, నవనీతాభిషేకాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చెరువును కబ్జా చేస్తే చర్యలు

మహాముత్తారం: చెరువులను ఎవరైన కబ్జా చేయాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మధవి అన్నారు. మండల కేంద్రంలోని నేతకానిపల్లే సమీపంలోని జోడెకుంట చెరువు కట్ట సమీపంలో నాలుగు రోజులక్రితం జేసీబీలతో తవ్వినట్లు గ్రామానికి చెందిన కొంతమంది తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం ఆర్ఐ శ్రీనివాస్ జోడెకుంటవద్ద తవ్విన ఆనవాళ్లను పరిశీలించి విచారణ జరిపి పంచనామా నిర్వహించారు. పంచనామా ఆధారంగా పలువురిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



సాయం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



సాయం అందజేస్తున్న డాక్టర్ రమేశ్

చిట్యాల: మండలంలోని నైన్‌పాక గ్రామానికి చెందిన కంకణాల రజిత ఇటీవల మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబానికి ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి రూ.8000 పంపించగా బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొడ్డె శంకర్, జన్నె యుగేందర్, సర్పంచ్ ఐలయ్య, మండల మహిళా అధ్యక్షురాలు ఈర్ల మల్లక్క, బీసీసెల్ మండల అధ్యక్షుడు కృష్ణయ్య, పుష్పక్క, సమ్మయ్య, రమేష్, జిలానీ, రమేశ్, విజేందర్, రాజయ్య, కుమార్ పాల్గొన్నారు.

చింతల్లపల్లిలో..

మండలంలోని చింతల్లపల్లికి చెందిన కల్వచర్ల మల్లయ్య ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఎన్జీఓ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ లయన్ డాక్టర్ అకుల రమేశ్ రూ.2 వేలు, 50 కేజీల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం గౌరవ అధ్యక్షుడు ఆకుల రవీందర్, అధ్యక్షుడు హరీష్, రవీందర్, కోడెల నర్సింహారాములు, సంపత్, శివరాజం పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

భూపాలపల్లి రూరల్: విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్–82 కార్యనిర్వాహక అధ్యక్షుడు నాగుల తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. విద్యుత్ ఉద్యోగులకు సంబంధించిన 29డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఎన్పీడీసీఎల్ ఆపరేషన్ డీఈ నాగరాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ యూనియన్ ఆదేశాల మేరకు ఆర్టిజన్ ఉద్యోగులు నేడు(మంగళవారం) డివిజన్ కార్యాలయాల్లో భోజన సమయంలో నిరసన తెలపాలన్నారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో జాక్ ఆధ్వర్యంలో యూనియన్‌లకు అతీతంగా ఉద్యోగులందరూ ఈ నెల 22న విద్యుత్ సర్కిల్ కార్యాలయాల ఎదుట మధ్యాహ్న భోజన సమయంలో ధర్నాలు చేపట్టాలని సూచించారు.

దామెరకుంట సర్పంచ్ సస్పెన్షన్?

కాటారం: మండలంలోని దామెరకుంట సర్పంచ్ రఘువీర్‌పై సస్పెన్షన్ వేటు పడినట్లు తెలిసింది. జీపీకి సంబంధించిన పలు అభివృద్ధి నిధులను సర్పంచ్ రఘువీర్ దుర్వినియోగం చేశారని గతంలో పలువురు వార్డు సభ్యులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో అప్పటి ఎంపీఓ మల్లికార్జున్‌రెడ్డి విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు. అధికారులు సర్పంచ్‌కు షోకాజు నోటీసు జారీ చేయగా ఆయన ఇచ్చిన సంజాయిషీతో సంతృప్తి చెందని కలెక్టర్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. ఈ విషయమై ఎంపీఓ ఉపేంద్రయ్యను వివరణ కోరగా దామెరకుంట సర్పంచ్‌ను కలెక్టర్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు, కాని ఆయన అందుబాటులో లేకపోవడంతో ఇంకా నోటీస్ అందజేయలేదని తెలిపారు. అందజేశాక అధికారికంగా వెల్లడిస్తామని పేర్కొన్నారు.

పోలీసుల తనిఖీ



వెంకటాపురం(కె): మండల పరిధిలోని వియాపురికాలనీ సమీపంలోని కొత్తపల్లికి వెళ్లే రహదారి వద్ద స్థానిక ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో సీ ఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు ముమ్మరంగా వాహనతనిఖీలు చేపట్టారు. చర్ల మండలం నుంచి వెంకటాపురం వచ్చి వెళ్లే వాహనా లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానిత వ్య క్తులు తారసపడితే వారి నుంచి పూర్తి స్థాయి స మాచారాన్ని తీసుకొని పంపిస్తున్నారు.తనిఖీ ల్లో సివిల్ పోలీసులు, తదితరులు ఉన్నారు.